నేడు 'డిజబిలిటీ అవేర్‌నెస్ వాక్'

కాచిగూడ: 'ఇంటర్నేషనల్ డిజేబిల్డ్ డే' సందర్భంగా ఈ నెల 21వ తేదీన నల్లకుంట ఫీవర్ ఆస్పత్రి చౌరస్తా నుంచి బర్కత్‌పుర చమన్ వరకు 'డిజబిలిటీ అవేర్‌నెస్ వాక్'ను నిర్వహించనున్నట్లు బీజేపీ డిజబిలిటీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం కో ఆర్డినేటర్ కొల్లి నాగేశ్వర్ రావు తెలిపారు. కార్యక్రమానికి అటల్ బిహారీ వాజ్‌పాయి ఫౌండేషన్ చైర్‌పర్సన్ కావ్యా కిషన్‌రెడ్డి, బీజేపీ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్.గౌతం రావు, కార్పొరేటర్లు కన్నె ఉమా రమేష్ యాదవ్, వై.అమృత తదితరులు హాజరవుతారని తెలిపారు.

24న శ్యామ్ మందిర్‌లో ఉచిత వైద్య శిబిరం

కాచిగూడ: కాచిగూడలోని శ్రీ శ్యామ్ మందిర్ ప్రాంగణంలో కిమ్స్-సన్‌షైన్ హాస్పిటల్స్ బేగంపేట ఆధ్వర్యంలో ఈ నెల 24వ తేదీన (ఆదివారం) ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు డాక్టర్ కొండ శ్రీనివాస్ రావు, కె.ఉదయ్ కుమార్ తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు శిబిరం అందుబాటులో ఉంటుందన్నారు. బీపీ, ఆర్‌బీఎస్, వెయిట్, హైట్, బీఎండీ, ఈసీజీ పరీక్షలతో పాటు జనరల్ మెడిసిన్, ఆర్థోపెడిక్, పల్మోనాలజీ, ఆంకాలజీ తదితర విభాగాలకు చెందిన వైద్యనిపుణులు రోగులకు ఉచితంగా వైద్య సేవలు అందిస్తారని తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని వారు సూచించారు. వివరాలకు సెల్: 91777 75016, 89779 40181లలో సంప్రదించాలన్నారు.

కలుషిత నీటితో పరేషాన్

- నల్లాల్లో రంగుమారిన నీటి సరఫరా
- దుర్వాసనతో వస్తున్నాయంటూ సర్వత్రా ఆందోళన
- నీటిని కొని తాగుతున్నామంటున్న స్థానికులు
- పట్టించుకోని అధికారులపై ప్రజల ఆగ్రహం
- సమస్య పరిష్కారానికి చర్యలు: జలమండలి అధికారులు



కుళాయి ద్వారా సరఫరా అవుతున్న కలుషిత నీటిని చూపుతున్న చారీలేన్ వాసులు



కలుషిత నీరు

నల్లకుంట: నగర ప్రజలకు ఉచితంగా సురక్షిత తాగునీటిని అందిస్తామంటూ చెప్పిన జలమండలి అధికారులు ఊదరగొట్టారు. అయితే చాలా ప్రాంతాల్లో కుళాయిల ద్వారా కలుషిత నీరు సరఫరా అవుతుండటంతో జలమండలి అధికారుల మాటలకు, చేతలకు పొంతనేలేదనే సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. ఆ శాఖ అధికారుల అలసత్వం, నిర్లక్ష్యంతో చాలా ప్రాంతాలలో కుళాయిల ద్వారా సరఫరా అవుతున్న తాగు నీరు కలుషితం అవుతోందనే ఆందోళనలు సర్వత్రా ఉన్నాయి. విధిలేని పరిస్థితుల్లో ప్రజలు కలుషిత నీటినే వినియోగిస్తూ రోగాల బారిన పడి ఆస్పత్రుల పాలవుతున్నారు. కలుషిత నీటి సరఫరాపై పలుమార్లు జలమండలి అధికారుల దృష్టికి తీసుకు వెళ్లిన సమస్య శాశ్వత పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలు మాత్రం శూన్యమని అధికారుల తీరుపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- పాత నల్లకుంట డాక్టర్ చారీ లేన్‌లో (ఇంటి నెంబర్ 2-1-4/ఏ నుంచి ఇంటి నంబర్ 2-1-42/2 వరకు) ఏడాదిన్నర కాలంగా తాగునీటి సరఫరా పైప్ లైన్‌లో లీకేజీల కారణంగా కలుషిత నీరు సరఫరా అవుతోంది. ఈ సమస్యను స్థానికులు పలుమార్లు జలమండలి ఏఈ, డీజీఎంతోపాటు ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లారు. అధికారులు మొక్కుబడిగా తాత్కాలిక చర్యలు తీసుకుంటున్నారు కానీ శాశ్వత ప్రాతిపదికన పరిష్కార చర్యలు తీసుకోవడంలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.
- కుళాయిల ద్వారా కలుషిత సరఫరా అవుతున్న కారణంగా విధిలేని పరిస్థితుల్లో ఫిల్టర్ వాటర్ కొనుగోలు చేసి వినియోగిస్తున్నామంటున్నారు. సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టకుంటే జలమండలి ఎండీ కార్యాలయం ఎదుట స్థానికులతో కలిసి ఆందోళన కార్యక్రమాన్ని చేపడతామని నల్లకుంట వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు శేఖర్ రెడ్డి, గంట లక్ష్మణ్, పీఎస్ చారి తదితరులు హెచ్చరిస్తున్నారు.

మురుగు నీరే గతి



డాక్టర్ చారీ లేన్‌లో సుమారు 18 నెలలుగా కలుషిత తాగునీరు సరఫరా అవుతోంది. ఈ విషయాన్ని జలమండలి అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. అప్పటికప్పుడు ఏదో చేసి మమ అనిపించారేతప్ప శాశ్వత ప్రాతిపదికన సమస్య పరిష్కారాని చర్యలు తీసుకోవడంలేదు. కనీసం ట్యాంకర్ల ద్వార కూడా నీటిని సరఫరా చేయడం లేదు. దుర్వాసన ఉన్న నీరు వినియోగించలేక, బయట నుంచి నీరు కొనుక్కొని తాగుతున్నాం.

– గంట లక్ష్మణ్, నల్లకుంట వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యుడు

కొనుక్కుని నీరు తాగాలంటే ఎలా?



గడచిన సంవత్సరంన్న కాలంగా కుళాయిల ద్వారా డ్రెయిన్ నీరు కలిసి వస్తుంది. దుర్వాసన వచ్చే నీటిని ఎలా వాడాలి. ఈ నీటిని తాగలేకపోతున్నాం. డబ్బు పెట్టి తాగునీరు కొనుక్కుని తాగాలంటే కష్టమే. ఇకనైనా జలమండలి అధికారులు స్పందించి వెంటనే కలుషిత నీటి సరఫరాకు శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టాలి.

– పి.ఎస్.చారి, నల్లకుంట వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యుడు

త్వరలోనే పరిష్కరిస్తాం

చారీ లేన్‌ను ఆనుకుని రెండు ఫీట్ల ఓ చిన్న గల్లీ ఉంది. ఆ చిన్న గల్లీలో వాటర్ లైన్, డ్రైనేజీ లైన్‌లు వేయడం కారణంగా కొన్ని సందర్భాలలో పైపుల్లో లీకేజీల కారణంగా మురుగు నీరు కలుస్తుందనుకుంటా. సమస్య మా దృష్టికి వచ్చిన వెంటనే అక్కడికి వెళ్లి పరిష్కరిస్తున్నాం. శ్వాతత పరిష్కారానికి త్వరలోనే చర్యలు తీసుకుంటాం. వాటర్ పైప్ లైన్ కొద్దిగా లోపలికి వేసి, డ్రెయిన్ పైపులు కొంచం పైకి వేస్తే కలుషిత నీరు సరఫరా సరఫరా సమస్య పరిష్కారం అవుతుంది. త్వరలో ఈ పనులు చేపడతాం.

– జాకీర్, జలమండలి విజ్ఞానపురి కాలనీ సెక్షన్ మేనేజర్

సాయుధ బలగాల్లో ఉద్యోగార్థులకు ఉచిత శిక్షణ

అంబర్‌పేట: కేంద్ర సాయుధ బలగాల్లో ఉద్యోగాల భర్తీకి కావాల్సిన శిక్షణను అర్హులైన నిరుద్యోగులకు ఉచితంగా అందించనున్నారు. పరావస్తు క్రియేటివ్ ఫౌండేషన్, రాంకీ ఫౌండేషన్ సంస్థల ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతీయువకులకు ఉద్యోగ నియమాకానికి కావాల్సిన నైపుణ్యాలపై శిక్షణ ఇస్తారు. ఉచిత భోజనం, వసతి, కావాల్సిన నైపుణ్యంపై నిపుణులతో శిక్షణ ఇవ్వనున్నట్లు రాంకీ ఫౌండేషన్ చైర్మన్ ముప్ప రాంరెడ్డి, పరవస్తూ క్రిటివ్ ఫౌండేషన్ ప్రతినిధులు గద్దె భాస్కర్, సందీప్ తెలిపారు. స్టాఫ్ సెలక్షన్ కమిషన్‌చే 81 వేల ఉద్యోగాల భర్తీ చేసే అవకాశం ఉందన్నారు. బీఎస్ఎఫ్, సీఐఎస్ఎఫ్, సీఆర్‌పీఎఫ్, ఐటీబీటీలతో పాటు ఆర్‌పీఎఫ్ వంటి ఉద్యోగాల కోసం శిక్షన ఇస్తామన్నారు. ఆసక్తి, అర్హత ఉన్న అభ్యర్థులు ఈ నెల 21వ తేదీలోపు తమ వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 23వ తేదీన హైదరాబాద్, గుంటూరులలో అర్హత పరీక్ష నిర్వహించి ఉచిత శిక్షణ తరగుతులకు అభ్యర్థులను ఎంపిక చేస్తామన్నారు. ఎంపికైన అభ్యర్థులకు 3 నుంచి 4 నెలల పాటు ఉచిత శిక్షణ ఉంటుందన్నారు. వివరాలకు సంస్థ ఫేస్‌బుక్, ఎక్స్ (ట్విట్టర్)లతో పాటు ఫోన్స్: 97036 51233, 73375 85959, 90007 97789లలో సంప్రదించాలన్నారు.

వీరసావర్కర్ విగ్రహం వద్ద గ్రీల్స్ ఏర్పాటు చేయాలి



జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు వినతి పత్రం ఇస్తున్న కార్పొరేటర్

కాచిగూడ: కాచిగూడ చౌరస్తాలోని వీర సావర్కర్ విగ్రహం వద్ద కాంపౌండ్ వాల్, గ్రీల్స్ ఏర్పాటు చేయాలని కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్ బుధవారం జీహెచ్ఎంసీ కమీషనర్ రోనాల్డ్ రాస్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. వీరసావర్కర్ విగ్రహం చుట్టు ప్రస్తుతం ఉన్న కాంపౌండ్ వాల్, గ్రీల్స్ శిథిలావస్థకు చేరుకుందని, దీంతో పాదచారులు, వాహనదారులు నిత్యం ఇబ్బందులకు గురవుతున్నారని ఆమె పేర్కొన్నారు. కాచిగూడ డివిజన్‌కు నూతనంగా జీహెచ్‌ఎంసీ ఏఈని నియమించాలని కోరారు.

దళిత క్రైస్తవులను ఎస్సీ జాబితాలో చేర్చాలి

కాచిగూడ: దళిత క్రైస్తవులను ఎస్సీ జాబితాలో చేర్చించి చట్టబద్ధత కల్పించాలని దళిత క్రైస్తవుల ఎస్సీ రిజర్వేషన్ సాధన సమితి అధ్యక్షుడు నాగళ్ల పోచయ్య రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ పార్టీ కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలంటే దళిత క్రైస్తవుల ఎస్సీ స్టేటస్ బిల్లు పెట్టించి, చట్టబద్ధత కల్పించాలని సీఎంకు బుధవారం వినతి పత్రం సమర్పించారు.

సామాజిక సేవలతో పేదలకు మేలు



పేదలకు అల్పాహారాన్ని పంపిణీ చేస్తున్న హైకోర్టు బార్ కౌన్సిల్ సభ్యులు కొండారెడ్డి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: సామాజిక సేవా కార్యక్రమాలతో పేదలకు మేలు జరగడంతో పాటు ఇతరులకు స్ఫూర్తిదాయకంగా ఉంటుందని తెలంగాణ హైకోర్టు బార్ కౌన్సిల్ సభ్యులు బి.కొండారెడ్డి అన్నారు. బుధవారం చిక్కడపల్లిలో కందూరి కృష్ణ ఫౌండేషన్, సేత్ మాణిక్‌లాల్ అగర్వాల్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సుమారు 1500 మంది పేదలు, కార్మికులు, వృద్ధులకు అల్పాహారం, పండ్లను పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన అల్పాహారాన్ని పంపిణీ చేశారు. అనంతరం కొండారెడ్డి మాట్లాడుతూ... నిరంతరం సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడం గొప్ప పరిణామం అన్నారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో గత 20 ఏళ్లుగా ఉచిత కంటి వైద్య శిబిరాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. ఫౌండేషన్ చైర్మన్ కందూరి కృష్ణా, ఆదాయ పన్ను శాఖ పబ్లిక్ ప్రాసిక్యూటర్ హెచ్.గోవింద్‌రావు, హైకోర్టు న్యాయవాది కె.కౌశిక్, ప్రమోద్ అగర్వాల్, సభ్యులు జ్వాలా, వరాలిని తదితరులు పాల్గొన్నారు.

కాచిగూడ నుంచి అజంతా ఎక్స్‌ప్రెస్ రైలు షురూ

కాచిగూడ: కాచిగూడ నుంచి మన్మాడ్ వెళ్లే అజంతా ఎక్స్‌ప్రెస్ రైలు మొదటి ట్రిప్ బుధవారం కాచిగూడ రైల్వే స్టేషన్ నుంచి ప్రారంభమైంది. ఈ సందర్భంగా కాచిగూడ రైల్వే స్టేషన్ డైరెక్టర్ కె.బాలాజీతో కలిసి సౌత్ సెంట్రల్ రైల్వే ఫ్యాన్స్ క్లబ్ ప్రతినిధులు అజంతా ఎక్స్‌ప్రెస్ వద్ద కేక్ కట్ చేసి వేడుకలను జరిపారు. కాచిగూడ రైల్వే స్టేషన్‌లో ప్రతి రోజు సాయంత్రం 6.40 గంటలకు ప్రారంభమై మన్మాడ్‌కు ఉదయం 8.05 గంటలకు చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో మన్మాడ్‌లో సాయంత్రం 8.50 గంటలకు ప్రారంభమై కాచిగూడకు ఉదయం 9.35 గంటలకు చేరుకుంటుందని స్టేషన్ డైరెక్టర్ కె.బాలాజీ తెలిపారు.

గ్రాఫిక్ డిజైనింగ్‌లో శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

నల్లకుంట: శ్రీ సత్యసాయి సేవా సంస్థలు హైదరాబాద్ ఆధ్వర్యంలో నల్లకుంట శివంలో ఉచిత 'గ్రాఫిక్ డిజైన్'లో శిక్షణ తరగతులకు అర్హులైన మహిళల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఈ నెల 30న ప్రారంభం కానున్న తరగతులకు 28 ఏళ్ల లోపు వయస్సు కలిగి పట్టభద్రులై, కంప్యూటర్ నాలెడ్జి ఉన్న మహిళలు అర్హులని శ్రీ సత్యసాయి సేవా సంస్థల హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ఎ.మల్లేశ్వర్‌రావు తెలిపారు. రోజూ ఉదయం 8 నుంచి 10 గంటల వరకు మొదటి బ్యాచ్, 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు రెండో బ్యాచ్‌లో శిక్షణ ఉంటుందన్నారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అక్కడ అందుబాటులో ఉన్న కంప్యూటర్ ల్యాబ్ ఉపయోగించుకోవచ్చని చెప్పారు. ఆసక్తి కలిగిన మహిళలు నల్లకుంట శివం రోడ్డులోని శివం మందిరం ప్రాంగణంలోని కార్యాలయం తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు ఫోన్స్: 90106 32555, 98484 87440లలో సంప్రదించాలని మల్లేశ్వరరావు సూచించారు.

గోశాలలను దత్తత తీసుకోండి



గోవులకు కుట్టి, మినరల్ మిక్చర్ పంపిణీ చేస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

కాచిగూడ: గోవుల రక్షణతోపాటు గోశాలలను దత్తత తీసుకోవడానికి స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని తెలంగాణ గోశాలల ఫెడరేషన్ గౌరవ అధ్యక్షుడు మహేష్ అగర్వాల్ పిలుపునిచ్చారు. లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సమర్పన్ శాఖ ఆధ్వర్యంలో బుధవారం అంబర్‌పేట, పటేల్‌నగర్‌లోని గోశాలలో గోవులకు నెల రోజులకు సరిపడా కుట్టి (దాణా), మినరల్ మిక్చర్‌ను పంపిణీ చేశారు. ప్రతి నెల ఒక గోశాలకు దాణా, మినరల్ మిక్చర్‌ను పంపిణీ చేయడానికి లయన్స్ క్లబ్ సమర్పన్ ప్రతినిధులు ముందుకు రావడం అభినందనీయమని ఆయన అన్నారు. లయన్స్ క్లబ్ సమర్పన్ అధ్యక్షుడు మహేందర్ గుప్తా, కార్యదర్శి నిర్మల్ కుమార్ జైన్, కోశాధికారి ప్రేమ్‌చంద్ మునోద్, స్వతంత్రసమరయోధులు పండిత్ గంగారామ్ స్మారక్‌మంచ్ అధ్యక్షుడు భక్తరామ్, అనిల్ కౌశిక్, బానోత్ గణేష్, లకావత్ రమేష్ పాల్గొన్నారు.

సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులను రెగ్యులరైజ్ చేయాలి: పీడీఎస్‌యూ



విద్యాశాఖ ముఖ్య కార్యదర్శికి వినతిపత్రమిస్తున్న పీడీఎస్‌యూ నేతలు

ముషీరాబాద్: తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలల్లోని సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులను రెగ్యులరైజ్ చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పి.మహేష్, శ్రీకాంత్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్ర వెంకటేశంను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రాష్ట్ర వ్యాప్తంగా నడుపుతున్న సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సు ఫీజులకు పూర్తి స్థాయిలో ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వడం లేదని, ఎంఎస్‌ఈ విద్యార్థులకు కోర్సు ఫీజు రూ. 36,500 ప్రకారం ఉంటే రాష్ట్ర ప్రభుత్వం కేవలం రూ. 20 వేలను మాత్రమే రీయింబర్స్‌మెంట్ ఇస్తున్నారని తెలిపారు. మిగతా సంవత్సరానికి రూ. 16 వేల ఫీజు విద్యార్థులపైనే అదనపు భారం పడుతోందన్నారు. నిజామాబాద్ జిల్లా ప్రభుత్వ అటానమస్ గిరిరాజ్ కాలేజీలో కోర్సు ఫీజులు కట్టనిదే పరీక్ష ఫీజు తీసుకోవడం లేదన్నారు. పలు ప్రభుత్వ కళాశాలల్లో ఇదే విధానం కొనసాగుతున్నదని ఆరోపించారు. పీడీఎస్‌యూ నేతలు గడ్డం శ్యామ్, జి.మస్తాన్, వినోద్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

వరిపై బోనస్ హామీని వెంటనే అమలు చేయాలి



మాట్లాడుతున్న భిక్షపతి

ముషీరాబాద్: వరి ధాన్యానికి క్వింటాల్‌కు రూ. 500 ప్రకారం బోనస్ ఇస్తామని కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీని తక్షణమే అమలు చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మామిడాళ్ల భిక్షపతి, బి.భాస్కర్‌లు డిమాండ్ చేశారు. బుధవారం అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం విద్యానగర్‌లో జరిగింది. వరిధాన్యం రైతులు అమ్ముకుంటున్నారని ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం వెంటనే బోనస్ ఇస్తే రైతులకు ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. వరితో పాటు ఇతర పంటలకు కూడా బోనస్ ప్రకటించాలని కోరారు. ఇటీవలి తుఫాన్ కారణంగా దెబ్బతిన్న పంటలకు నష్టాన్ని అంచనా వేసి నష్టపరిహారం అందించాలని కోరారు. కార్యక్రమంలో జడ సత్యనారాయణ, గౌనీ ఐలయ్య, మోగిలి ప్రతాప్‌రెడ్డి, గంగారెడ్డి, దుడ్డు గంగాధర్, ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.

పాక జ్ఞానేశ్వరికి నామినేటెడ్ పదవి ఇవ్వాలి



మాట్లాడుతున్న గుండు జగదీశ్, వినోద్, నర్సింగరావు

చిక్కడపల్లి: కామారెడ్డి మున్సిపాలిటీ కౌన్సిలర్ పాక జ్ఞానేశ్వరి ఉన్నత పదువులివ్వాలని తెలంగాణ రాష్ట్ర గంగపుత్ర సంఘం కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి విజ్ఞప్తి చేసింది. బుధవారం సాయంత్రం చిక్కడపల్లిలోని గంగపుత్ర సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో సంఘం అధ్యక్షుడు గుండు జగదీశ్‌బాబు, కోశాధికారి ముడారి వినోద్, ఉపాధ్యక్షులు గడప నర్సింగరావు మాట్లాడుతూ... విద్యావేత్త, న్యాయవాది పాక జ్ఞానేశ్వరి కాంగ్రెస్ పార్టీకి అందిస్తున్న విస్తృత సేవలను గుర్తించి ఎమ్మెల్సీ లేదా కార్పొరేషన్ చైర్మన్ పదవిని ఇవ్వాలని కోరారు. రాజకీయంగా వెనుకబడిన గంగపుత్రులకు ఉన్నత పదవులను ఇచ్చి ప్రోత్సహించాలన్నారు. కాంగ్రెస్‌తోనే గంగపుత్రుల సంక్షేమం సాధ్యమన్నారు. నేతలు కె.నర్సింహ, ఎస్.వెంకటేశ్, టి.రాజ్ కుమార్, కె.రాజు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరాపార్కులో అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలి



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న అధికారులు

యూబీడీ అడిషనల్ కమిషనర్ కృష్ణ

కవాడిగూడ: ఇందిరాపార్కులో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తిచేయాలనిఅడిషనల్ కమిషనర్ (యూబీడీ) కృష్ణ సంబంధిత కాంట్రాక్టర్‌లను ఆదేశించారు. బుధవారం ఇందిరాపార్కులో సంబంధిత అధికారులతో కలిసి అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రోజ్ గార్డెన్‌లో వాటర్ ఫౌంటేన్, వాకింగ్ ట్రాక్ అభివృద్ధి, ఓపెన్‌జిమ్ ఎక్విప్‌మెంట్స్, పార్కులో అదనపు బెంచీలు, ఇందిరాగాంధీ విగ్రహానికి మరమ్మతులు తదితర అభివృద్ధి పనులను జరుగుతున్నాయని ఆయన తెలిపారు. ఇందిరాపార్కులో మెరుగైన సౌకర్యాలతో పాటు గ్రీనరీ, క్లీనింగ్ మెయింటెనెన్స్ సమయానుకూలంగా నిర్వహించి ఆహ్లాదకర వాతావరణాన్ని పెంపొందిస్తామని తెలిపారు. జోనల్ కమిషనర్ రవికిరణ్, యూబీడీ డైరెక్టర్ శ్రీనివాస్‌రావు, ముషీరాబాద్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ తిప్పర్తి యాదయ్య, జోనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీనివాస్, ముషీరాబాద్ ఉద్యానవన అధికారి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులందరికీ ఉచిత బస్‌పాస్ సౌకర్యం కల్పించాలి: పీడీఎస్‌యూ



సమావేశంలో పాల్గొన్న పీడీఎస్‌యూ నాయకులు

ముషీరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో నూతన ప్రభుత్వం విద్యాను బలోపేతం చేయాలని, విద్యారంగానికి అధిక నిధులు కేటాయించి పేదలు, బడుగు బలహీన వర్గాల విద్యను కాపాడాలని పీడీఎస్‌యూ జాతీయ నేత ఎస్.నాగేశ్వరరావు, రాష్ట్ర అధ్యక్షుడు పెద్దింటి రామకృష్ణ అన్నారు. మార్క్స్ భవన్‌లో పీడీఎస్‌యూ రాష్ట్ర కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... విద్యార్థులందరికీ ఉచిత బస్ పాస్ సౌకర్యం కల్పించాలని కోరారు. విద్యార్థులు అందరూ తమ అకడమిక్ చదువుతో పాటు సమాజాన్ని కూడా అర్థం చేసుకోవాలన్నారు. మత్తు పానీయాలు, ఇతర డ్రగ్స్ వైపు కాకుండా మంచి సమాజం కోసం ఆలోచన చేయాలన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు పృథ్వీ, నరేందర్, అనిల్, భాస్కర్, నర్సింహారావు, సంధ్య, ప్రవీణ్, సుమంత్, సీతారం, రాకేష్, మహేందర్, అషుర్, గణేష్, అజయ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఒకే పనికి.. ఇద్దరు వేర్వేరుగా శంకుస్థాపనలా?

- ఎమ్మెల్యే ముఠాగోపాల్ ఒకసారి, కార్పొరేటర్ సుప్రియా నవీన్‌గౌడ్ మరోసారి పనుల ప్రారంభం
- సమన్వాయ లోపంపై సర్వత్రా విమర్శలు



సెయింట్ పాయిస్ స్కూల్ సమీపంలో పైప్‌లైన్ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్



ఎమ్మెల్యే ప్రారంభించిన పనులను ప్రారంభిస్తున్న ముషీరాబాద్ కార్పొరేటర్ సుప్రియనవీన్‌గౌడ్

ముషీరాబాద్: ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ ప్రారంభించిన 15 నిమిషాల అనంతరం స్థానిక కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్ అదే పనిని మరోసారి ప్రారంభించారు. దీంతో డ్రైనేజీ పైప్‌లైన్ ప్రారంభోత్సవం ముషీరాబాద్‌లో చర్చానీయంశంగా మారింది.

- ముషీరాబాద్ డివిజన్‌లోని సెయింట్ పాయిస్ స్కూల్ సమీపంలో రూ. 6.50 లక్షల వ్యయంతో డ్రైనేజీ పైప్‌లైన్ల నిర్మాణ పనులను బుధవారం ఉదయం 10.30 గంటలకు ఎమ్మెల్యే ముఠా గోపాల్, జలమండలి డీజీఎం మోహన్‌రాజ్‌తో కలిసి ప్రారంభించి అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఉదయం 11 గంటల అనంతరం ముషీరాబాద్ డివిజన్ కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్ సైతం ప్రారంభించిన స్థలానికి చేరుకోని వారు కూడా జలమండలి అధికారులతో కలిసి మరోసారి డ్రైనేజీ పైప్‌లైన్ పనులను ప్రారంభించారు. అసెంబ్లీ కొనసాగుతున్నందున త్వరగా వెళ్లాల్సి ఉందని జలమండలి అధికారులకు, బీఆర్ఎస్ పార్టీ నాయకులకు చెప్పి ఎమ్మెల్యే ముఠా గోపాల్ వెళ్లిపోయారు. తాము చెప్పిన సమయానికే వచ్చామని, అప్పటికే ఎమ్మెల్యే పనులు ప్రారంభించి వెళ్లిపోతే ఎలా అని కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్ ప్రశ్నించారు. తమ కోసం ఒక్క ఐదు నిమిషాలు ఆగలేరా అని విచారం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే కావాలనే తాము రాకముందే పనులను ప్రారంభించి వెళ్లిపోయారని ఆరోపించారు. ఇదిలా ఉంటే ఎమ్మెల్యే కార్పొరేటర్ ఇద్దరు వేరు వేరుగా పనులు ప్రారంభోత్సవంలో జలమండలి అధికారులు పాల్గొనడం గమనార్హం. కార్యక్రమంలో బీఆర్ఎస్ ముషీరాబాద్ మీడియా సెల్ ఇన్‌చార్జీ ముచ్చకుర్తి ప్రభాకర్, డివిజన్ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీధర్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు దీన్‌దయాల్‌రెడ్డి, సుధాకర్ గుప్తా, డివిజన్ ఉపాధ్యక్షుడు లక్ష్మణ్‌గౌడ్, నాయకులు నేత భాస్కర్, బాలరాజుగౌడ్, మురళి, బీజేపీ ముషీరాబాద్ నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ ఎం.నవీన్‌గౌడ్, డివిజన్ బీజేపీ అధ్యక్ష, కార్యదర్శులు బద్రీనారాయణ, కంచి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాంనగర్‌లో...

రాంనగర్ డివిజన్‌లోని రిసాలగడ్డ వద్ద గల ఫైర్‌స్టేషన్ వీధిలో బుధవారం రూ. 3.50 లక్షలతో చేపట్టిన డ్రైనేజీ పైప్‌లైన్ పనులను ఎమ్మెల్యే ముఠా గోపాల్, రాంనగర్ డివిజన్ కార్పొరేటర్ రవిచారితో కలిసి ప్రారంభించారు. చాలాకాలంగా ఉన్న డ్రైనేజీ సమస్య పైప్‌లైన్ నిర్మాణంలో శాశ్వతంగా పరిష్కారం అవుతుందని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాంనగర్ డివిజన్ నాయకులు ముచ్చకుర్తి ప్రభాకర్, ముదిగొండ మురళి, మధు, ఎర్రం శేఖర్, జలమండలి డీజీఎం మోహన్‌రాజ్, సెక్షన్ మేనేజర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



ముషీరాబాద్: ముషీరాబాద్‌లోని రెయిన్‌బో హోమ్ అనాథాశ్రమంలో బుధవారం హిప్నో కమలాకర్ సైకాలజిస్ట్ ప్రతినిధి కృష్ణవేణి ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికలకు స్వెట్టర్లు, నోటు పుస్తకాలు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో యోగా మాస్టర్ సరోజిని రామారావు, జ్యోతి రాణి తదితరులు పాల్గొన్నారు.

సీఎస్‌రావు ఆలోచనలకు రూపు 'గీతాంజలి'



మాట్లాడుతున్న ప్రముఖ రచయిత బీఎస్ రవి, వోలేటి పార్వతీశం

చిక్కడపల్లి: సామ్యవాద భావకుడు తన నాటక రచనలతో ఆలోచనలు రేకెత్తించిన సీఎస్ రావు ఆలోచనలకు రూపు గీతాంజలి ఉన్నత విద్యాలయం అని ప్రముఖ సాహితీ వేత్త డాక్టర్ వొలేటి పార్వతీశం అన్నారు. బుధవారం త్యాగారాయ గానసభలో ప్రధాన వేదికపై అశోక్‌నగర్‌లోని గీతాంజలి హైస్కూల్ 41వ వార్షికోత్సవం బాలల నృత్యాలు పాటల మధ్య సందడిగా జరిగాయి. ముఖ్య అతిథిగా డాక్టర్ వోలేటి పార్వతీశం మాట్లాడుతూ... నలభై ఏళ్ల పాటు విలువలకు కట్టుబడి విద్యాలయాన్ని నడపడం సులువుకాదన్నారు. రావు లోకాన్ని వీడి పదేళ్లు పైగా గడచినా ఆయన ఉన్నత ఆశయాలను కొనసాగుతున్న విద్యాలయ పాలక వర్గంను అభినందించారు. ప్రముఖ రచయిత బీఎస్ రవి తల్లిదండ్రులు తమ పిల్లలకు తొలి గురువులు అని పేర్కొన్నారు. గీత రచయిత సిరాశ్రీ ఉన్నత శ్రేణిలో పాస్ అయిన వారికి బహుమతులు అందజేశారు. రంగస్థల ప్రముఖులు డీఎస్ మూర్తికి అతిథులు సీఎస్ రావ్ స్మారక పురస్కారం బహుకరించారు. విద్యవేత్త సావిత్రి సందేశం ఇచ్చారు.